క్లుప్తంగా

వాకర్ల వితరణ



పార్కు సిబ్బందికి పని పరికరాలు అందజేస్తున్న వాకర్లు

అమలాపురం టౌన్: స్థానిక మంచినీటి చెరువు వద్ద గల చంద్రబాబు ఆరోగ్య ఉద్యాన వనం (పార్కు)లో పనికి ఉపయోగించే కొడవళ్లు, కత్తెర్లు, కలుపు మందు ద్రావణం బాటిళ్లు తదితర పరికరాలు, వస్తువులను వాకర్స్ రూ.10 వేల వ్యయంతో సమకూర్చారు. ఆదివారం వాటిని పార్కు సిబ్బందికి వాకర్స్ ప్రతినిధులు రామాయణం వెంకటేశ్వరరావు, కోకా నానిబాబు, యక్కల చినబాబు, దంగేటి ప్రసాద్, వంకాయల కాశి అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు యండమూరి గంగ, కట్టోజు సన్నయ్యదాసు తదితరులు పాల్గొన్నారు.

విలసవిల్లి సొసైటీ చైర్మన్‌గా ఏసు



ఏసును దుశ్శాలువాతో సత్కరిస్తున్న పార్టీ నాయకులు

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి విక్రయ సంఘం లిమిటెడ్ చైర్మన్‌గా గ్రామానికి చెందిన పుత్సల వెంకటేశ్వరరావు(ఏసు) నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనను ఎంపీపీ దంగేటి వీర అచ్యుత జానకి, జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు, సర్పంచ్ సలాది ఊర్మిళా దేవి తదితరులు దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, సొసైటీ కార్యదర్శి కరేళ్ల నాగరాజు, బళ్ల నాగ సతీష్, ఆశపు వీరభద్రరావు, కోలా ఏసు, ఎంపీడీవో గౌరీకుమారి తదితరులు పాల్గొన్నారు.

బీరువా బహూకరణ



పాఠశాలకు బీరువాను బహూకరిస్తున్న బ్యాంకు మేనేజరు జోగి రవికిరణ్

ఐ.పోలవరం: స్థానిక జెడ్పీ పాఠశాలకు గ్రామంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖ మేనేజర్ జోగి రవికిరణ్ రూ.18 వేల విలువ చేసే ఆరు లాకర్ల బీరువాను బహూకరించారు. ఆదివారం పాఠశాల హెచ్‌ఎం వీధి సురేష్‌బాబుకు బీరువాను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్‌ను గ్రామ సర్పంచ్ దంతులూరి రాఘవరాజు, స్కూల్ చైర్మన్ రేవు సారెడ్డి, దంగుడుబియ్యం వెంకటరామయ్య, జంపా సత్యనారాయణ, రాయపురెడ్డి బాబి తదితరులు అభినందించారు.

19న జార్జిపేట సర్పంచ్ ఎన్నికకు పోలింగ్

తాళ్లరేవు: తాళ్లరేవు మండల పరిధిలోని జార్జిపేట సర్పంచ్ పదవి ఎన్నికకు ఆదివారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 8 నుంచి 10 వరకూ నామినేషన్ల స్వీకరణ, 11న నామినేషన్ల పరిశీలన, 14న పోటీలోని అభ్యర్థుల ప్రకటన, నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని నోటిఫికేషన్‌లో తెలిపారు. ఈ నెల 19వ తేదీన పోలింగ్ నిర్వహించి అదే రోజు ఫలితాలు వెల్లడించనున్నారు. జార్జిపేట సర్పంచ్‌గా పనిచేసిన కోలా సత్యదేవి మృతి చెందడంతో సర్పంచ్ ఎన్నిక అనివార్యమైంది. గతేడాది ఏప్రిల్ 21 నుంచి ఉపసర్పంచ్ పేర్ని ఆదినారాయణ ఇన్‌చార్జి సర్పంచ్‌గా వ్యవహరిస్తున్నారు.

ఆర్డినెన్స్‌ను రద్దు చేయాలి

తాళ్లరేవు: అసైన్డ్ భూములను అమ్ముకోవొచ్చని ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌ను తక్షణమే రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రజా సంఘాల భవనంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం కాకినాడ జిల్లా కార్యవర్గ జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో టేకుమూడి ఈశ్వరరావు, సంఘ జిల్లా కార్యదర్శి కేవీఎస్ శ్రీనివాస్, కూరాకుల సింహాచలం, దుప్పి అదృష్టదీపుడు, చొల్లంగి వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలుచేయాలి

అమలాపురం రూరల్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఉద్యోగాలు పర్మినెంట్ చేస్తామని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలని అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కుంచె అంజిబాబు కోరారు. ఆదివారం ఈదరపల్లిలో ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో జిల్లా పశుసంవర్ధక హాస్పటల్ అటెండర్స్ అసోసియేషన్, అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్యల ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. సమావేశంలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై చర్చించారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ అనుబంధం అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బి.వెంకట్‌రాజు, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వల్లూరి రాజబాబు, బి రమేష్, సహాయ కార్యదర్శి కడితే సతీష్, నాగమణి అంజిబాబు పాల్గొన్నారు.

చేయూతతో స్వయం ఉపాధి

- కుటీర పరిశ్రమల స్థాపనతో డ్వాక్రా మహిళలకు భరోసా
- ఇంటి నుంచే వ్యాపారాలు చేస్తున్న అతివలు

అమలాపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న చేయూతతో డ్వాక్రా సంఘాలకు చెందిన మహిళలు ఇంట్లోనే కుటీర పరిశ్రమలు స్థాపించుకుని స్వయం ఉపాధికి బాటలు వేసుకుంటున్నారు. వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, జనన్న తోడు, జగనన్న చేదోడు, సున్న వడ్డీ ఈ అయిదు పథకాల ద్వారా అర్హతలను బట్టి లబ్ధిదారులై మహిళలు సొంతంగా వ్యాపారాలు చేస్తూ తమ కాళ్ల మీద తాము నిలబడుతున్నారు.

అమలాపురం పట్టణంలో మొత్తం 834 డ్వాక్రా సంఘాలుండగా వాటి పరిధిలో 8,255 మంది సభ్యులున్నారు. ఆయా సంఘాల స్వయం ఉపాధికి పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఊతం ఇస్తోంది. 834 సంఘాల్లో 410 సంఘాలు ప్రభుత్వం ఇచ్చే చేయూతను ఆసరాగా చేసుకుని కుటీర పరిశ్రమలు స్థాపించి పలు ఉత్పత్తులను ఇంట్లోనే తయారు చేస్తూ ఉపాధి పొందుతున్నారు.

స్వయం ఉపాధి ద్వారా పట్టణ డ్వాక్రా మహిళలు నెలకు సమారు రూ.కోటికి పైగా వ్యాపార లావాదేవీలు చేస్తున్నారు. తమ తమ ఇళ్లలోనే కుటీర పరిశ్రమల తరహాలో పిండి వంటలు, స్వీట్లు, పచ్చళ్ల తయారీ, ఫినాయిల్ తదితర లిక్విడ్‌ల తయారీ, భోజనం ప్లేట్ల తయారీతో పాటు ఎంబ్రాయిడరీ, వస్త్ర దుకాణాలు, కిరాణా దుకాణాలు ఇలా పలు మార్గాల్లో మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులేస్తున్నారు. తమ వ్యాపారాల నిమిత్తం మరికొంత మందికి ఉపాధి మార్గాన్ని చూపిస్తున్నారు.



స్వయం ఉపాధితో టైలరింగ్ పనిచేసుకుంటున్న మహిళ

ఫినాయిల్ తయారీతో ఉపాధి



ప్రభుత్వం ఇస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుంటూ నేను ఫినాయిల్ తదితర లిక్విడ్‌లు తయారుచేసే కుటీర పరిశ్రమను ఏర్పాటు చేసుకున్నాను. వీటితో పాటు డిటర్జెంట్ లిక్విడ్లు, హార్పిక్, కుంకుమ రసం, పళ్ల పొడి తదితర వస్తువులను తయారు చేసి మార్కెటింగ్ చేస్తాను. ఇంట్లోనే నాకు నేనుగా స్వయం ఉపాధితో సంపాదించుకోవడం సంతోషంగా ఉంటుంది.

– వై.భారతి, కురసాల వీధి, అమలాపురం

ఇంటి వద్దే టైలరింగ్



నేను వైఎస్సార్ చేయూత, జగనన్న తోడు, జననన్న చేదోడు, సున్న వడ్డీ పథకాల ద్వారా వచ్చిన లబ్ధితో ఇంటి వద్దే టైలరింగ్ షాపు పెట్టుకుని స్వయం ఉపాధి పొందుతున్నాను. ప్రభుత్వం డ్వాక్రా సంఘాలకు ఇస్తున్న రుణాలు కూడా ఎంతో ఆదుకుంటున్నాయి. మెప్మా అందిస్తున్న సహకారం, సూచనలతో స్వయం ఉపాధికి ఢోకా లేకుండా ముందుకెళుతున్నాం.

– పాము శ్యామల, సావరం, అమలాపురం

మహిళలకు అండగా మెప్మా



పట్టణంలో డ్వాక్రా సంఘాల మహిళలు స్వయం ఉపాధికి ఏ ప్రయత్నం చేసినా మెప్మా తోడుగా ఉంటుంది. వారికి ప్రభుత్వ పరంగా కావాల్సిన సాయం, పథకాలు, ఏర్పాట్ల గురించి సరైన సూచనలు, సలహాలు ఇస్తాం. పట్టణంలోని మహిళలు స్వయం ఉపాధికి బాటలు వేసుకుంటూ అమలాపురాన్ని పేదరికరహిత పట్టణంగా తీర్చిదిద్దే లక్ష్యంతో మెప్మా పనిచేస్తోంది.

– వి.రామలక్ష్మి, సిటీ మిషన్ మేనేజర్, మెప్మా, అమలాపురం

ఎంపీ అనురాధ పరామర్శ



ఎంపీటీసీ సభ్యుడు చిన సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ అనురాధ

అల్లవరం: తూర్పులంక-ఎంట్రుకోన ఎంపీటీసీ సభ్యుడు కుంచే చినసత్యనారాయణ మృతికి ఎంపీ అనురాధ సంతాపం తెలిపారు. చినసత్యనారాయణ కుటుంబసభ్యులను ఆదివారం పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కొమరగిరిపట్నంలో ఇటీవల మృతి చెందిన పిండిప్రసాద్ కుటుంబసభ్యులను ఎంపీ పరామర్శించి ధైర్యం చెప్పారు. ఎంపీ వెంట ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, మహేష్ ఉన్నారు.

కౌలు రైతులకు వ్యక్తిగత రుణాలు

కాట్రేనికోన: మండల పరిధిలో పైలెట్ గ్రామాలుగా ఎంపికచేసిన గెద్దనపల్లి, దొంతుకుర్రుల్లో కౌలు రైతులకు వ్యక్తిగత రుణాలను అందజేస్తామని కాట్రేనికోన మండల వ్యవసాయ అధికారి కె.ప్రవీణ్ తెలిపారు. కౌలు రైతులకు వ్యక్తిగత రుణాలు అందజేయాలని జిల్లా కలెక్టరు ఆదేశాలిచ్చారన్నారు. ఇప్పటివరకూ దొంతుకుర్రు, గెద్దనపల్లి గ్రామాల్లో 85 మంది కౌలు రైతులను గుర్తించి బ్యాంకు ఖాతాలు తెరిపించామని, వారికి త్వరలోనే రుణాలు అందజేస్తామని చెప్పారు.

మానవ తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాలు

- జిల్లా రవాణా శాఖ అధికారి అశోక్ ప్రతాపరావు



జిల్లా రవాణా శాఖ అధికారి ప్రతాపరావును సత్కరిస్తున్న వాకర్స్ సభ్యులు

అమలాపురం రూరల్: సీటు బెల్టు పెట్టుకోకపోవడం, హెల్మెట్ పెట్టుకోకపోవడం వంటి మానవ తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాల్లో అనేక మరణాలు సంభవిస్తున్నాయని జిల్లా రవాణా శాఖ అధికారి అశోక్ ప్రతాపరావు అన్నారు. స్థానిక ఎస్‌కేబీఆర్ కళాశాలలో ఆదివారం జరిగిన వాకర్స్ సాధారణ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై వాకర్స్ సభ్యులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. అనంతరం క్లబ్ సభ్యులు ప్రతాపరావును సత్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి పుత్సా కృష్ణ కామేశ్వర్, వైఎస్ఎన్ మూర్తి, పుత్సా రాజేశ్వరి, గోటేటి గంగాధరరావు, డాక్టర్ రాఘవేంద్రరావు, డాక్టర్ విష్ణుమూర్తి, డాక్టర్ పప్పు శర్మ, పేరి లక్ష్మీనరసింహం, గోకరకొండ నాగేంద్రరావు, వీవీఆర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మనిషి జక్కంపూడి



జక్కంపూడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ తదితరులు



జక్కంపూడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

- ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, ఇజ్రాయిల్

అమలాపురం టౌన్: మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహన్‌రావు ప్రజల మనిషని ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్‌లు అన్నారు. ఆదివారం జక్కంపూడి జయంతి సందర్భంగా స్థానిక నల్ల వంతెన వద్ద గల జక్కంపూడి విగ్రహానికి వారిద్దరూ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు మాట్లాడుతూ పోరాటాల ద్వారానే జక్కంపూడి రామ్మోహన్‌రావు ప్రజలకు చేరువయ్యారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ మాట్లాడుతూ జక్కంపూడి తన జీవితాంతం ప్రజా సేవలోనే గడిపారంటూ గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డికి జక్కంపూడి అత్యంత విశ్వాసపాత్రుడన్నారు. అనంతరం జక్కంపూడి జయంతి కేక్‌ను ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ కట్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి నాగేంద్రమణి, రాష్ట్ర దృశ్య కళల అకాడమీ చైర్‌పర్సన్ కుడుపూడి సత్య శైలజ, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, హార్టికల్చర్ యూనివర్సిటీ బోర్డు మెంబర్ జిన్నూరి వెంకటేశ్వరరావు, జిల్లా పార్టీ సేవాదళ్ అధ్యక్షుడు మంగళంపల్లి అంజిబాబు, జిల్లా పార్టీ ఐటీ విభాగం అధ్యక్షుడు తోరం గౌతమ్, మున్సిపల్ కౌన్సిలర్ చిత్రపు రామకృష్ణ తదితరులు జక్కంపూడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మణిపూర్‌లో దాడులు అరికట్టాలి



అమలాపురం ప్రెస్ క్లబ్ భవనంలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న వేడంగి చిట్టిబాబు



ముమ్మిడివరం బుద్ధపార్కులో జరిగిన సమావేశంలో పాల్గొన్న నాయకులు

అమలాపురం టౌన్: మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న విచక్షణ రహిత దాడులను అరికట్టాలని ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు, పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేడంగి చిట్టిబాబులు డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్ క్లబ్ భవనంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మణిపూర్ మారణ కాండపై ఆదివారం సాయంత్రం జరిగిన సదస్సుకు వారిద్దరూ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, దళిత మహిళా శక్తి జాతీయ కన్వీనర్ కొంకి రాజామణి, ఐఏపీటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్వర్లు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, ముత్యాల శ్రీనివాసరావు, కారెం వెంకటేశ్వరరావు, ఎ.రవి, ఏడిద రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటన హేయమైన చర్య

ముమ్మిడివరం: మణిపూర్ రాష్ట్రంలో దళిత మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేసి హత్య చేయడం హేయమైన చర్య అని ఏపీ షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘ సమావేశం తీవ్రంగా ఖండించింది. ఆదివారం స్థానిక బుద్ధ పార్కులో మట్టా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ మణిపూర్ ఘటనల్లో దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జనిపెల్ల సత్యనారాయణ, కాశి వెంకటాచార్య, ఎం.ఆశీర్వాదం, కాశి జగ్జీవన్‌రామ్, ఎస్.అబ్బులు, జనిపెల్ల బాలకృష్ణ, జగడం బైరవస్వామి తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు

తాళ్లరేవు: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని కోరంగి ఎస్‌ఐ పి.శ్రీనివాసకుమార్ హెచ్చరించారు. ఆదివారం జాతీయ రహదారిలోని పోలేకుర్రు వై.జంక్షన్, తాళ్లరేవు బైపాస్ రహదారిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 15 మంది మద్యం సేవించి బైక్ నడపడంతో వారిపై కేసులు నమోదు చేసి బైక్‌లను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మందుబాబుల వల్ల అభం శుభం తెలియని అమాయకులు బలవుతున్నారని, అందుకే విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు.



పోలేకుర్రు వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ శ్రీనివాసకుమార్

ఘనంగా స్నేహితుల దినోత్సవం



స్నేహితుల దినోత్సవం సందర్భంగా చిన్నారితో కేక్ కట్ చేయిస్తున్న ఎంపీ అనురాధ



35 సార్లు రక్తదానం చేసిన వర్రే శేషును సత్కరిస్తున్న చాంబర్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ



స్నేహితుల దినోత్సవం నాడు కలుసుకున్న 1985-86 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

అల్లవరం: స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకోవడం ద్వారా మిత్రుల మధ్య ప్రేమానురాగాలు పెరుగుతాయని ఎంపీ చింతా అనురాధ అన్నారు. ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మొగళ్ళమూరు ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఎంపీ అనురాధ కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా పలువురు ఎంపీ అనురాధకి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు మట్టపర్తి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుల రక్తదానం

అమలాపురం రూరల్: లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. పేరూరు వైజంక్షన్‌లోని సాయి విశ్వాస్ హాస్పిటల్‌లో బుద్దల బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో సుమారు 45 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా 35 సార్లు రక్తదానం చేసిన వర్రే శేషు, రక్తదాతలను సర్టిఫికెట్లతో సత్కరించారు. లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ ఫౌండేషన్ ఫౌండర్ అధ్యక్షుడు కొలిశెట్టి తాతాజీ, లక్ష్మీదుర్గ దంపతులు, డాక్టర్ గంధం విశ్వనాథ్, డాక్టర్ శివన్నారాయణ, మాజీ మున్సిపల్ చైర్మన్ యాళ్ళ నాగసతీష్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫ్రెండ్‌షిప్ డే

తాళ్లరేవు: నేషనల్ ఫ్రెండ్‌షిప్ డే వేడుకలను ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా జరుపుకున్నారు. చిన్నా, పెద్ద తేడా లేకుండా అందరూ తమ స్నేహితులకు శుభాకాంక్షలు తెలియజేశారు. చిన్ననాటి స్నేహితులను కలుసుకుని పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తాళ్లరేవు శ్రీమతి నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985–86వ సంవత్సరంలో టెన్త్ పూర్తి చేసిన విద్యార్థులందరూ ఆదివారం కలుసుకుని ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్స్ కట్టి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఫ్రెండ్‌షిప్‌డే రోజున చిన్ననాటి స్నేహితులందరినీ కలిసి ఇలా సంతోషంగా గడపడం చాలా ఆనందంగా ఉందని రోళ్ల చక్రవర్తి, దంగేటి రాంబాబు తదితరులు తెలిపారు.

పీడిత వర్గాల అభ్యున్నతికి పోరాడిన యోధుడు



అమలాపురంలో గద్దర్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

అమలాపురం టౌన్: పీడిత వర్గాల అభ్యున్నతి కోసం తన జీవితమంతా పోరాడిన యోధుడు గద్దర్ అని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. ప్రజా సంఘాలు, వామ పక్షాల ఆధ్వర్యంలో స్థానిక గడియారం స్తంభం సెంటరులో ఆదివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఆయన గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసిన నివాళులర్పించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, కొంకి రాజామణి తదితరులు ప్రసంగించారు.

గద్దర్ లేని లోటు తీర్చలేనిది

తాళ్లరేవు: తన పాటలతో ఉద్యమాలకు ఊపిరి పోసిన ప్రజా కవి గద్దర్ లేని లోటు ఎవరూ తీర్చలేనిదని విశ్వజన కళామండలి జిల్లా అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గద్దర్ మృతికి ఉంగరాల వెంకటేశ్వరరావు, పోతుల రత్నకుమారి, యడ్ల కుటుంబరావు, వాకపల్లి చిరంజీవి, తుపాకుల ప్రసాదరావు, బస్సా రమణ, చింతలపూడి రాజా సంతాపాన్ని తెలియజేశారు.

చిన్నారులకు భగవద్గీత శ్లోకాల పోటీలు



విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహిస్తున్న అమలాపురం ఇస్కాన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: వచ్చే నెల 7న జరగనున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల సందర్భంగా స్థానిక మాచిరాజు వీధిలో గల ఇస్కాన్ సెంటరులో 15 ఏళ్ల లోపు బాలబాలికలకు భగవద్గీత శ్లోకాల పోటీలను ఆదివారం నిర్వహించారు. భగవద్గీతలోని 15 శ్లోకాలను ఐదు నిమిషాల్లో పూర్తి చేసేలా ఈ పోటీలు జరిగాయి. పోటీల విజేతలకు శ్రీ కృష్ణ జన్మాష్టమి రోజున బహుమతులు అందజేస్తామని ఆ సెంటరు ఇన్‌చార్జి శివానంద నిమయిదాస్ తెలిపారు.

నేడు రాష్ట్రపతి పుదుచ్చేరి పర్యటన

యానాం: రాష్ట్రపతి ద్రౌపదిముర్ము సోమవారం పుదుచ్చేరిలో పర్యటించనుండటంతో 1500 మంది పోలీసులు, 200 మంది పారామిలటరీ ఫోర్స్ సిబ్బందితో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. భద్రతా ఏర్పాట్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ వర్మ, కలెక్టర్ వల్లవన్ పరిశీలించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా రాష్ట్రపతి ద్రౌపదిముర్ము జిప్‌మెర్‌లో రూ.17.1 కోట్లతో చేపట్టిన అధునాతన రేడియోథెరిపీ వ్యవస్థను ప్రారంభించనున్నారు. అనంతరం అరబిందో ఆశ్రమం, మనకులార్ వినాయగర్ దేవాలయం సందర్శన, మురున్‌గప్పకం హెండీ క్రాఫ్ట్ విలేజ్ సందర్శన, 8న తిరుకంచి దేవాలయాలను సందర్శించనున్నారు. రెండు రోజుల పాటు పుదుచ్చేరి వ్యాప్తంగా డ్రోన్లు, బెలూన్లు ఎగరేయకూడదంటూ నిషేధం విధించారు. రాష్ట్రపతి పర్యటనలో పాల్గొనేందుకు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఇప్పటికే పుదుచ్చేరికి చేరుకున్నారు.

తాగునీటి కోసం నిరసన

అల్లవరం: ఏపీ రైతు కూలీ సంఘ సమాఖ్య, ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో ఎస్.పల్లిపాలెం పంచాయతీ పరిధిలోని మహిళలు తాగునీటి కోసం ఖాళీ బిందెలతో ప్రధాన రహదారిపై ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీఆర్‌సీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ తాగునీటి కోసం పల్లిపాలెం ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, వారానికోసారి తాగునీరు సరఫరా చేయడానికి కూడా అధికారులు విఫలమవుతున్నారని ఆరోపించారు. తక్షణమే అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో తాగునీరు సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో వల్లూరి రాజబాబు, కడితి సతీష్, కుంచే అంజిబాబు, నాగమణి, కొట్టాల వెంకటరెడ్డి, అమ్మాజీ, దుర్గ తదితరులు పాల్గొన్నారు.